# ఆహుతి

సరిగ్గా ఇలాంటి వానరాత్రి ..." అన్నాడు చలపతిరావు. ఆ పైని మాటలు వినపడలేదు. తనలో తాను గొణుక్కున్నాడు.

టేబుల్ మీద వెలుగుతున్న కొవ్వొత్తి గాలికి వణికిపోతోంది వెంటిలేటర్లోంచి చలిగాలి ఈడ్చికొడ్తోంది. అప్పటికే నారయ్య తలుపులు కిటికీలు వేశాడు. తూర్పు వాన గావటం మూలాన, కిటికీ సందుల్లోంచి, తలుపుల సందుల్లోంచి, వాననీరు క్లబ్బుహాలులో కొస్తోంది. డాక్టరు పరిశీలనగా, చలపతిరావు ముఖంలోకి చూశాడు. అతనేదో లోకంనుండి, కలలు గంటున్నట్లున్నాడు. అప్రయత్నంగా కళ్ళల్లోకి చెమ్మవొచ్చి అంత శీతలవాతావరణంలోనూ ఇంకి పోయింది. అడ్వొకేట్ ప్రభాకరరావు ముద్దాయిని చూసినట్టు చలపతిరావును చూశాడు.

* * *

చాలా సంవత్సరాల కిందటి సంగతి. గుంటూర్లో థరిడియర్ చదువుతున్నాను. అప్పుడే నాకు జానకితో పరిచయమైంది. ఆ పరిచయానికి ప్రారంభమేమిటో నా కిప్పుడు స్పష్టంగా జ్ఞాపకం లేదు. నాకు జ్ఞాపకమున్నదే నిజమయితే, అది ఇలా జరిగి ఉంటుంది.

ఆంధ్ర వారోత్సవాలు జరుపుకొంటున్నాం. ప్రముఖు లెందరినో ఆహ్వానించాం. నేను ఆహ్వాన సంఘానికి కార్యదర్శిని. ఒక రోజు సాయంత్రం మహాసభ జరుగుతున్నది. భావకవిత్వాన్ని గురించి ఉపన్యాసాలు సాగుతున్నవి. ఉన్నట్టుండి సభలో ఒకమూల చిన్న కలవరం రేగింది. ఉపన్యాసాన్ని సాగించమని, నేనా గోల

జరుగుతున్న దగ్గర కెళ్ళాను. అప్పటి కప్పుడే ఓ పాతికమంది స్టూడెంట్సు జానకిని చుట్టుముట్టారు. నవ్వుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు. "ఓహో" - "రంభ" - 'ఎర్రతేలు" - "ఒంటె" - "డార్లింగ్" ఇదీ వరస. నేను ఆ గుంపులో జొరబడ్డాను. జానకి తలవంచుకొని నిలబడ్డది. ఇంతమంది కేకలు పెడుతున్నా, ఆమె తల ఎత్తలేదు. పెదవి కదపలేదు ... కారణమేమిటంటే — ఆ రోజునా జానకి మామూలుగానే వచ్చింది. మాసిపోయిన చీరె, చిరుగు కుట్టిన జాకెట్టు, దుమ్ముకొట్టుకున్న తల ... దరిద్రం ఓడుతూవుంది. నాకూ నవ్వొచ్చింది. ఏం ? ఈ దరిద్రపు వేషంతో కాలేజీకి రాకపోతేనేం ? ఈ చదువెవడు చదవమన్నాడు ? ఇలాటి నారీ రత్నాలు చదవకపోతే మునిగి పోయిందేమిటి ? హాయిగా ఓ మగాణ్ణి చేసుకొని కాపరం మండించక - ఇంకా ఈ చదువెందుకు? అర్థంలేదు ... ఇలా అనుకొన్నాను. బహుశః అనిగూడా ఉంటాను. లేకపోతే జానకి తలెత్తి చూడదు. అసహ్యంతో జానకిని చూశాను. నా చూపులకు ఆమె సిగ్గుపడాలని నా అభిప్రాయం. కానీ అలా జరగలేదు.

జానకి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ముఖం రోషంతో కంది పోయింది. ఒక క్షణం నా వేపు చూసింది. నా అంతరాళాన్ని భేదించింది ఆ చూపు. నా హృదయం చివుక్కుమంది. ఎందుకు జానకిని అలా అన్నాను ? అని నేను సాధించిందేమిటి ? ఎందుకామె దరిద్రాన్ని జ్ఞాపకంచేసి బాధ పెట్టాను ? జానకి సత్వరున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. నా సోదరులు మరొక్కసారి ఈలలువేసి, చప్పట్లు చరిచి, కేకలువేసి తమ సంతోషాన్ని ప్రకటించారు ...

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు. ఆత్మ ఘోషించి పోయింది. కన్నీటితో ప్రకటించిపోయిన జానకి రూపం కళ్ళల్లో

మెదిలింది. జాలితో కరిగిపోయాను. అందుకు పరిహారంగా ఆమెకు క్షమాపణ చెప్పుకోవా లనుకున్నాను. అలా చేయటం ఆత్మాభిమానానికి భంగమని నా కనిపించలేదు.

అయితే ఆ అవకాశం నాకు చాలా రోజులవరకూ లభించలేదు. జానకి కాలేజీకి రావటంలేదని తెలిసింది. ఆ మాటవిన్నప్పుడు, నేనెంత క్షోభించానో ఇప్పుడు చెప్పలేను. ఏ భాషా దాన్ని వ్యక్తం చేయలేదు. ఆమె చదువు మానటానికి ముఖ్యకారణం నేనే నన్న అనుభూతి పొందాను. నామీద నాకే అసహ్యా మేసింది. ఒక రోజు పనిగట్టుకొని వారింటి కెళ్ళాను. నా హీనత్వం మరింత నగ్నంగా అక్కడ బైట పడ్డది.

జానకి తండ్రి ప్లీడరు గుమాస్తా. ఆరుగురు పిల్లల తండ్రి. జానకే అందరిలోకి పెద్దది. ఆ కుటుంబానికి వేరే దక్షత లేదు. తండ్రి సంపాదనతోనే గడవాలి. జానకి "విజ్ఞానం" కోసం చదవటం లేదు. ఎక్కడో ఉద్యోగంచేసి, కుటుంబాని కింత సాయపడదామని జానకి అభిప్రాయం. తండ్రిగూడా ఇదే ఉద్దేశంతో జానకిని చదివిస్తున్నాడు. కొంతకాలం కిందట ఆమెకు పెళ్ళి చెయ్యాలని ప్రయత్నించాడట. విపరీతమైన కట్నాలుచూసి ఆ దౌర్భాగ్యుడు హడలిపోయాడు. ఇక జన్మలో కూతురుకు వివాహం చెయ్యలేనను కొని కుంగిపోయాడు. జానకి ధైర్యం చెప్పింది. చదవడానికి మొదలెట్టింది.

ఇదంతా విన్న తరువాత నా మనస్సు వికావికలైంది. జానకిని క్షమించమని అభ్యర్థించాను. పక్కున నవ్విందామె.

"ఏం"? అన్నాను.

"మీరేం తప్పుచేశారని నేను క్షమించను? నా దరిద్రాన్ని చూసి నవ్వారు. ఇందులో తప్పులేదు దరిద్రం నాకు లేకపోయినా మీరు నవ్వినట్లయితే — ఏమో చెప్పలేను. నాకున్న లోపాన్ని 'ఉన్నది' అని మీరన్న మాత్రాన, ఉడుకోకవటం నాది తప్పు గాదా, చలపతిరావుగారూ?" అన్నది జానకి నవ్వుతూ.

చచ్చిపోయాను.

అంతే! అప్పటినుండి మా యిద్దరకూ ప్రగాఢ పరిచయ మేర్పడ్డది. గత సంవత్సరం సరిగ్గా పుస్తకాలు కొనని కారణంగా జానకి పరీక్ష ఫెయిలయింది. విరక్తితో తండ్రి మానెయ్యమన్నాడట. తీరిక వేళల్లో ఆడపిల్లలకు ట్యూషన్ను చెప్పి, జీతానికి పుస్తకాలకు గుడ్డలకు కావలసిన డబ్బు సంపాదించుకొన్నదట. "ఇప్పటికీ సాయంత్రపువేళ నాల్గు ట్యూషన్లు చెబుతున్నాను" అన్నది జానకి. అందువల్ల ఇరవైనాలుగు రూపాయ లొస్తాయట. ఇంటి ఖర్చుకు సరిపోతాయన్నది జానకి.

జానకి నా కంటికి మానవ మాత్రురాలుగా లేదు అప్పట్లో. చాలామంది అనుకొన్నట్లు — నేను జానకి సౌందర్యాన్ని చూసి భ్రమపడ లేదు. అంతకంటే మించిన అప్సరసలను డజన్లకొద్దీ నేను చూశాను.

వాళ్ళకు శరీరం సౌందర్యమే ఉంది. మానసిక సౌందర్యం లేదు. దైహికంగా జానకి ఎంత నిరాడంబరంగా ఉంటుందో, ఆమె మనస్సు అంత అందంగానూ ఉంటుంది.

నాకిప్పటికీ అర్థంగాని దేమిటంటే, స్త్రీ పురుషుల పరిచయం పరిచయం దగ్గిరే ఆగిపోదెందుకా అని. దానికా్కరణం నేను ఊహించలేను. జానకితో నాకటువంటి పేచీయే వచ్చింది. ప్రేమ గూడా ఒరకం స్వార్థమే ననుకొంటాను.

జానకితో నా పరిచయం పెద్దదవుతున్నకొద్దీ ఆమె 'మంచితనం' నన్నమితంగా ముగ్ధుణ్ని చేయసాగింది. ఆ మంచితనం, నాకు దక్కకుండా, మరొకరు దొంగిలిస్తారేమోనన్న భయం, లీలగా కలగసాగింది. అలానే జరిగితే జీవితం దుస్సహంగా మారిపోతుందనిపించేది. ఆ మంచితనం నాకే దక్కాలని ఆశిస్తుండేవాణ్ని. ఈ మాటే నేనొకసారి జానకితో అన్నాను.

"అయితే నన్నేం చేయమంటారు?" అన్నది జానకి ఫక్కున నవ్వి.

మల్లెలు విరిసినట్లయింది.

నేను తత్తరపడ్డాను. నిజమే! అయితే జానకి ఏం చేయాలి? ఏం చేయాలని ఆశించి, నేనా మాటన్నాను? ముచ్చెమటలు పోశాయి. నోటంట మాట రాలేదు. జానకి నా అవస్థ చూసి మరింత నవ్వింది. నవ్వటమంటే ఏమిటో జానకి దగ్గరే నేర్చుకోవాలి. మహాకవి కవిత్వంలాగా, నేరుగా గుండెల్ని తాకుతుంది జానకి నవ్వు. అంత స్వచ్ఛంగా, నిర్మలంగా, ఆరోగ్యంగా నవ్వగలిగిన వాళ్ళను, మళ్ళీ నేను చూడలేదు.

అటువంటి విచిత్రావస్థను "ప్రేమ" అంటారని నా కప్పుడు తెలీదు. నిజంగా ప్రేమకు అదే నిర్వచనమైతే, అది వాంఛనీయమే నంటాను. అందులో స్వార్థం లేకపోలేదు; కావచ్చు. అయితే ఏమయినట్టు? అన్నిరకాల స్వార్థాలూ మనిషికి అంతటి ఆనందానిస్తాయని నే ననను. మరొకరన్నా నేను నమ్మను...

జానకిని నేను ప్రేమిస్తున్నానని తేలిపోయింది. ఇలాగని జానికితో ఓ నాడన్నాను.

"మంచిపని చేస్తున్నారు!" అన్నది జానకి నవ్వి.

నేను మాట్లాడ లేదు,

"ప్రేమించి?" అన్నది జానకి నవ్వడం ఆపి. ఇలా జనమే జయ ప్రశ్నలు వేయకుండా, కాండ్రించి ఉమ్మి కోపంతో వెళ్ళి నట్లయితే, నే నెక్కువ సంతోషించే వాణ్ణి.

"నీకు ప్రేమలో నమ్మకం లేదా?" అన్నాను గవును.

"నా కలాంటి అనుభవం జరగలేదు. దాన్ని గురించి ఆలోచించే తీరికగూడా లేదు. ప్రేమంటే ఏమిటో తెలీకుండా, దాన్ని నేను నమ్ముతున్నాననో, లేదనో మీతో ఎలా చెప్పనండి?" అన్నది జానకి, విశాలంగా నవ్వుతూ.

దానికి సమాధానంగా నే నేమన్నానో సరిగ్గా జ్ఞాపకంలేదు. మళ్ళీ ఒకనాడు ఏదో సందర్భాన ఈ రకమైన ప్రసంగం వచ్చి నప్పుడు నే నన్నాను—

"నువ్వంటే నాకు చాలా ఇష్టం జానకీ!" అని. అంతకన్నా ఏమనాలో నాకు తోచలేదు.

జానకి నవ్వింది.

"నేను హాస్యంగా అనటంలేదు. నిజంగా నువ్వంటే నాకు చాలా యిష్టం"

"థాంక్స్" అన్నది జానకి, కళ్ళు మూసుకుని ఒక క్షణం ఆలోచించి, "మీరంటే నా కేంతో గౌరవం!"

"ఎందుచేత?" అన్నాను. వెంటనే నే నొకరకం సమాధానం ఆలోచించుకున్నాను. అలాంటిదే జానకి నోటినుండి గూడా వస్తుం దని నా ఆశ.

"కార్యకారణ వాదంలో నాకర్థం కనిపించటం లేదిప్పుడు. నిజంగా, మీమీది గౌరవానికి కారణ మేమిటో చెప్పలేను" అన్నది జానకి.

"ఇలా ఎంతకాలం చదువుతావు జానకీ?"

"ఏమో? మా కుటుంబ పరిస్థితులు ఇలాగే ఉంటే బి. యే. పూర్తి చేదా మనుకుంటున్నాను. లేకపోతే, ఈ సెకండియర్ తో ఆగిపోతాను" జానకి ముఖంమీద బాధ బరువుగా కదిలింది.

"మాని?"

"ఏం చెప్పను చలపతిరావ్? మాని ఏం చెయ్యడమో తోచడం లేదు." కొన్ని క్షణాలు ఎవ్వరమూ మాట్లాడ లేదు.

"బహుశా మీనాన్న నీ వివాహం ఇప్పట్లో చెయ్యడను కొంటాను" భయపడుతూ అన్నాను.

జానకి ఫక్కుమని నవ్వింది.

"మంచి సంబంధం యెక్కడన్నా ఉన్నదా, రావుగారూ?" తత్తరపోయాను నేను.

"మీ నాన్న కిష్టమయితే నేను చేసుకుంటాను" ఎలానో మాట పూర్తి చేశాను.

"మా నాన్ననే!" అన్నది జానకి లుంగలు చుట్టుకొని పోయేలా నవ్వుతూ.

నాకూ నవ్వొచ్చింది.

"నీకిష్టమైతే, మీ నాన్న కాదనడు జానకీ! నాకు తెలుసు. నీ అభిప్రాయ మేమిటి?"

జానకి మాట్లాడ లేదు. తలవంచుకుంది నేను జాగ్రత్తగా జానకిని పరిశీలించాను. కపోలాలు సిగ్గుతో ఎర్రబడ్డాయి. దరహాసం మిన్నాగులా పెదవులపై పరువులెత్తింది. అంత చలాకీగా వుండే జానకి, లజ్జా భారంతో అలసిపోయినట్టు కనిపించింది. ఆనందంతో చిన్న కేక వేసినట్టు జ్ఞాపకం...

ప్రేమకు మనస్సు నిలయమంటారు పెద్దలు. అది నిజమే నేమో గాని, ప్రేమకు దేహంతో గూడా సంబంధ ముంటుంది. నేను జానకిని ప్రేమించటం, ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకోవటం, ఆమె కూడా దాని కంగీకరించడం - ఇవన్నీ నామనస్సును తీవ్రంగా వత్తిడి చేశాయి. అప్పటికప్పుడే జానకిమీద సర్వాధికారాలు సంప్రాప్తించిన య్యనుకొనేవాణ్ణి. ఈ గుత్తాధికార భావనలు బహుశః "వివాహ వ్యవస్థ" నుండి వచ్చాయేమో?

మనస్సు రేపే వాంఛలకూ ఒత్తిడులకూ నేను కలవరపడే వాణ్ణి. ఆ అసంతృప్తస్థితికి, కొంత సంతృప్తి కావాలి. అది మానసికం కాదు. మనస్సునూ, దేహాన్ని విడివిడిగా చూడటంలో — దేహం లేకపోతే మనస్సు వుంటుందని నమ్మలేను. అలాగే మనస్సు లేని దేహామూ నిరర్థకమే! వీటి రెంటికీ అవినాభావ సంబంధ ముంటుం దని నా అభిప్రాయం. ఒకదాని ప్రభావం మరొకదానిమీద ప్రస రించక తప్పదు. కాలు నరుక్కున్నప్పుడు మనస్సు సంతోషించదు. భార్య చచ్చిందన్న వార్త విని, శరీరం ఆనందంతో నాట్యంచెయ్యదు. ఎందుకు చెబుతున్నానంటే నా మానసికానందం, శరీరాన్ని మరొక కార్యంకోసం ప్రోత్సహిస్తున్నట్టు నా కనుమానం —

మామూలుగా జానకి నా గది కొచ్చింది. ఆరోజు సినిమా కెళ్ళాలనుకొన్నా మనుకొంటాను. ఉన్నంతలో కొంచెం మేకప్ చేసుకొని వచ్చింది జానకి. నాలో వెర్రి ఆవేశం విజృంభించింది.

రక్తం ఉరకలెత్తింది. ఏదో శక్తి నన్ను ముందుకు గెంటుతున్నట్లు ఫీలయ్యాను. ఎంతటి ఆవేశ మొచ్చినా పరవశత్వం చెందలేదు. అందుకు తార్కాణం తలుపులు జాగ్రత్తగా వేయటం. జానకి ఏదో భయపడినట్లు — అదీ స్వల్పంగా — అనుమానం. నేను జానకి చేయి పట్టుకొన్నాను. వదిలించుకోవాలని ప్రయత్నం. నా కళ్ళు మూసుకు పోయినాయి. జానకిని గట్టిగా కౌగలించు కొన్నాను — వెర్రిగా ముద్దు పెట్టుకున్నాను... వెచ్చని గాలి నా ముఖాన్ని కాల్చింది. వణుకుతున్న జానకి వేళ్ళు నా తలను దగ్గ రకు లాక్కున్నాయి ఓ ప్రచండమైన తుఫాను...తీవ్రమైన కాంతి గోళాలు, తలలో విచ్చినట్లయింది...

అలా కొన్ని నెలలు గడిచాయి.

ఒకనాడు మానాన్న వచ్చాడు. ఆరు పేజీల ఉత్తరం నా ముందు పడేశాడు. ఒక 'శ్రేయోభిలాషి' మా నాన్న కా జాబు వ్రాశాడు. నేను జానకిని 'ఉంచుకొని' ఎలా చెడిపోతున్నదీ వైన వైనంగా అందులో ఉంది. నేనా ఉత్తరాన్ని కాదనలేదు. అదంతా నిజమేననీ, నేనా అమ్మాయిని పెళ్ళిచేసుకో బోతున్నాననీ చెప్పాను. ఇప్పుడు నాకు అంతగా జ్ఞాపకం లేదనుకోండి, ఒక్క ఏడుపు మినహా మిగతావన్నీ చేశాను.

"వీల్లేదు. ఎనిమిదెకరాల మాగాణీ, పాతికవేల రొఖ్ఖం పద్ధతిమీద నీకు సంబంధం మాట్లాడాను. నువ్వొప్పుకోవాలి" అన్నాడు నాన్న.

"లేకపోతే ?"

"చస్తాను"

నాకు భయమేసింది. మానాన్న జేబులోనుంచి పెద్దచాకు తీసి నాకిచ్చి —

"దీనితో నన్ను పొడిచి, నీయిష్టమొచ్చిన సంబంధం చేసుకో! నేను కాదనను. ఊc తీసుకో" అన్నాడు.

నా చేతులు వణికాయి. చాకు తీసుకొన్నాను. మా నాన్న ముఖంలోకి చూశాను. ఆయన కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. మనిషి వణికిపోతున్నాడు, ఏం చెయ్యను? మా నాన్న పట్టుదల నాకు తెలుసు. తనకు తెలియకుండా నాకు క్రాఫు పెట్టించిందని మా అమ్మ జుట్టు సగం కత్తిరించాడాయన. అయిదు రూపాయల బాకీకోసం, పదహారువేల దాకా కోర్టులపాలు చేసిన విషయం నాకు తెలుసు. ఈ క్షణాన చాకుతో పొడిస్తే — పొడిపించు కుంటాడు. కాని పొడవగలనా? నా శ్రేయస్సుకోసమని గదా ఆయనగారిపట్టుదల చూపుతున్నది? అది నిజంగా నాకు సుఖ దాయకం కాకపోవచ్చు; కానీ ఆయన చిత్తశుద్ధిని శంకించలేను. ఒక స్త్రీకోసం కన్నతండ్రిని హత్య చెయ్యలేకపోయాను.

జానకితో ఈ విషయం ఎలా చెప్పను? చెప్పిన తరువాత...? తరువాత ఏమౌతుందో ఊహించలేక పొయ్యాను. తలలో తారు లాంటి చీకటి అలుముకొంది. వళ్ళంతా జ్వరమొచ్చినట్లు వెచ్చ బడ్డది. కణతలు టక టక కొట్టుకొంటున్నాయి. నిలబడలేక ముసుగుపెట్టుకొని పడుకొన్నాను.

జానకి వచ్చింది. కొద్దిగా కళ్ళుతెరచి చూచాను. విద్యుద్దీపం వెలుతురులో పచ్చగా మెరిసిపోతున్నది. తెల్లని జరీ చీర, రోజా రంగు జాకెట్టు, నల్లని ముఖమల్ స్లిప్పర్లు, అగ్గిదారాల్లాంటి గాజులు, కాటుక కళ్ళు, విచ్చుతున్న రోజాలాంటి నవ్వు... ముఖం దిండులో దాచుకొని ఏడ్చాను. నిన్న సాయంత్రం - జానక్కి బావుంటాయని

నేనే వీటిని సెలెక్టుచేసి కొన్నాను. నా కోసం వాటిని వేసుకొచ్చింది. ఈ 'నాకోసం' అన్నపదం, నా గుండెను గాలంలా పట్టుకొంది. గిజగిజలాడిపోయాను.

"రావుగారూ !"

జానకి ఆదుర్దాగా నా మంచంమీద కూచుని పొట్టమీద చెయ్యివేసింది. ఆమె వేళ్ళు భయంతో వణకడం నేను గ్రహించాను. ముసుగుతీసి, వెల్లికితలా తిప్పి నుదురుమీద చెయ్యివేసి చూసింది.

"జ్వరం తగిలింది" అన్నది జానకి ముఖం చిట్లించి. "ఇటువంటప్పుడు ఇక్కడుండటం మంచిది గాదు. బండి మాట్లాడతాను; మా యింటికెడదాం రండి"

నాకు దుఃఖం పుక్కిలింత లయింది.

"ఇందుకే ఇంత భయపడతా రేమిటండీ ? — ఫర్వా లేదు. మా నాన్నగారేమీ అనుకోరు — ఈ సంగతి — అదే - పెళ్ళి సంగతి ... నాన్నతో ఎప్పుడో చెప్పాను. ఎంత సంతోషించాడని! మీరంటే మానాన్నకు ఎంతో గౌరవముంది. 'ఎంత మంచివాడు కాకపోతే అలా క్షమించమంటాడే అమ్మాయ్ ?' అంటాడు ఎప్పుడూ. రేపు మాఘమాసంలో మంచి లగ్నాలున్నాయట ..."

నేనిక దుఃఖం పట్టలేక పోయాను. బావురుమని ఏడ్చేశాను. జానకి అమితంగా భయపడి పోయింది ... సరిగ్గా ఇలాంటి వాన రాత్రి ... బైట కుంభపోతగా వర్షం. బంగారు కత్తుల్లాగా మెరుపులు ... లాగి తంతున్న గాలి. నా మనస్సులాగానే ప్రకృతి కూడానూ ... ఎలాగో ... చెప్పలేను - ఊహించలేను - ఎలాగో

మా నాన్నకూ నాకూ జరిగిన గొడవంతా చెప్పాను. అలా చెబు తున్నప్పుడు, నా మాట పడిపోతే, గుండె ఆగిపోతే, నాలుక తెగి పోతే —

మొదట తేలు కుట్టినట్లు ఉలిక్కిపడ్డది. తరువాత గోడకు జేరగిలబడి ప్రశాంతంగా విన్నది. ముఖంలో విచారమున్నట్టు లేదు కళ్ళు నీటితో నిండి తళుక్కు మన్నాయి. చీరతో వొత్తుకొంది. ఎర్రటి గాజులు మెత్తగా చప్పుడు చేశాయి. కాటుక చెరగి, బుగ్గమీదికి జారింది. కొన్ని క్షణాలు మౌనంగా కళ్లు మూసుకొంది. ఏమాలోచించిందో! ఆ క్షణాన ఆమె మనస్సు ఎంత అల్లకల్లోల మయిందో! ఆ ప్రశాంతం అడుగున దాగిన దావానలం ఎటువంటిదో — నే నూహించలేను. జానకి మెల్లిగా లేచివెళ్ళి కిటికీ తీసింది. చెయి బైటికి చాపి, ఓ క్షణం ఉండి చేయి తీసుకొని నా వైపు తిరిగి —

"వర్షం బాగా తగ్గింది. బండిని పిలవమంటారా ?" అన్నది మామూలుగా.

నేను అదిరిపోయాను.

"పోన్లెండి. మీరు నన్ను అన్యాయం చేశారనుకోను. ఎందు కనుకోవాలి ? నేను మిమ్మల్ని ఆకర్షించినట్లే, మీరూ నన్నా కర్షించారు. ఇందులో మీవొక్కరిదే తప్పుకాదు; ఓ రకంగా నాదే తప్పేమో ? ..." అని ఆగి, "రండి - కొంచెం నెమ్మదించిన తరువాత తిరిగొద్దురు గాని" అన్నది.

ఆమె నిక భరించలేక పోయాను. ఆ కారుణ్యం నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. ఆమె భుజంమీద తల ఆన్చి ఏడ్చాను.

జానకి నన్ను ఆప్యాయంగా ఓదార్చింది. ముఖాన్ని రెండు చేతులతోనూ దగ్గరకు తీసుకొని —

"నిజం చెప్పాలంటే, ఈ పని చేయవలసింది నేను. మీరే ఇలా అయితే ఎలా చెప్పండి ! మీరు నన్ను కావాలని ఇలా అనటం లేదు గదా ! నేనంటే ఇప్పటికీ మీకు ఇష్టమేనయ్యె ! మరి కాలం కలిసి రానప్పుడు మీరు మట్టుకేం చేస్తారు ? మాటవరసకు — మీతో పెళ్లికి మా నాన్న ఒప్పుకోడనుకోండి. బహుశా నేనింత విచార పడను ..."

ఆ చివరిమాట లనేప్పుడు ఆమె కంఠం వొణికింది.

"నేను రాను. రాలేను. నిన్ను భరించలేను" ఎలాగో అన్నాను.

జానకి నాలుగైదు నిమిషాలు తల వంచుకొని నిలబడింది. బహుశా అప్పుడామె ఏడ్చి ఉంటుందని నా నమ్మకం. ఓదార్చటాని కూడా అనర్హుణ్ణని పించింది.

"సరే నేను వెడుతున్నాను— వర్షం గూడా తగ్గింది"

మరోమాట లేకుండా జానకి తలుపు తీసుకొని వెళ్ళిపోయింది. అదే ఆఖరుసారిగా ఆమెను చూడటం. వెళ్ళేప్పుడు, ఎడమచేయి ఎర్రగాజులు, సన్నని నీలపుటుంగరం, ఒక్కసారి లైటు వెలుగులో మెరిశాయి. అదే చివరి దృశ్యం,

నే నలాగే మంచంమీద పడుకొన్నాను. వళ్ళంతా వెర్రెత్తి నట్టుంది. లేచి కూర్చున్నాను. వెళ్ళి 'జానకిని తీసుకొద్దామా' అనుకొన్నాను. నాకు - తండ్రి - జ్ఞప్తికొచ్చాడు ... ఓ అరగంట దాకా వీధి చివరినుండి ఓ స్త్రీ ఏడుపు నాకు వినపడుతూనే వుంది. నేను కదల లేదు. సరిగ్గా ఇలాంటి వానరాత్రి...

తలుపులు బార్లగా తీసి, వాకిట్లో కూచున్నాను. వర్షం తగ్గిపోయింది. తడిరోడ్డుమీద వెలుతురు పడి రోడ్డును బంగారు పొడితో కప్పింది. ఉండి వుండి చల్లని గాలి ముఖానికి తగిలి వెనక్కు వెడుతోంది. గొడవపెడుతూ సైడు కాలవలు పరుగిడుతున్నాయి. చూరునుండి "టప్—టప్" మంటో చినుకులు పడుతున్నాయి. "ఝుయ్" మంటూ ఓ కారు, నీళ్ళను చిందకొడుతూ వెళ్ళింది. గడగడ వణుకుతున్న కుక్క ఎదరింటి గుమ్మమెక్కింది. ఆ ఆసామీ అదిలించి వెళ్ళగొట్టాడు. తోక ముడుచుకొని కుక్క రోడ్డు మధ్యగా వెళ్ళిపోయింది. ఆ వానలో కుక్కను వెళ్ళగొట్టినందుకు అతన్ని అసహ్యించుకొన్నాను. కానీ — నేను జానకిని...

అంతే డాక్టరుగారూ! అప్పటికీ ఇప్పటికీ మళ్ళీ నాకు జానకి కనిపించలేదు. నేను గుంటూరు వెళ్ళనూ లేదు.

* * *

చలపతిరావు చెప్పటం ఆపేశాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ప్లీడరు ముఖాన చిరునవ్వు విరిసింది. డాక్టరు సీరియస్‌గా సిగరెట్టు కాలుస్తున్నాడు.

వర్షం ఇంకా కుంభపోతగా కురుస్తూనే ఉంది. మెరుపు కొరడా దెబ్బలకు మబ్బులు బొబ్బలు పెడుతున్నాయి. చలిగాలి "ఝుయ్" మంటో తలుపుల్ని నెట్టిపారేస్తున్నది. నారయ్య లోపలి కొచ్చిన నీటిని బొక్కెనలోకి ఎత్తి పారబోస్తున్నాడు.

"ఈ వర్షం వెలిసేట్టు లేదు"

"అవును బాబయ్యా!" అన్నాడు నారయ్య.

"అంతే! అలా కొన్ని జరిగిపోతాయి" అన్నాడు డాక్టరు సిగరెట్టు డ్రాయరుకొత్తి పారేస్తూ. "చెప్పలేం! వాటికి కారణాలు

వెదకలేం. వెదికినా దొరకవు. కావాలని ఇన్‌టెన్‌షనల్‌గా మనం చెయ్యమా; ఘోరమైన ఫలితాలిస్తాయి. ప్చ్. ఏమిటో వెధవ జీవితం......అర్థంలేదు".

ఏదో చెప్పనున్న వాడిలా గొంతు సరిచేసుకొన్నాడు. ఓ నిమిషంసేపు కాండిల్ కేసి చూశాడు. కొవ్వొత్తి కరిగిపోయి చారలు చారలుగా గడ్డకట్టింది. అడుగుభాగాన ఓ పురుగు కొడికి కొట్టుకొని, కరిగిన కొవ్వులో పడి, ఓ క్షణం తన్నుకొని మానే సింది.

## 2

"చలపతిరావు గారన్నట్లు, ప్రతిదానికీ కారణం వెదకడం వృధా ప్రయాస'' అన్నాడు డాక్టరు.

చలపతిరావు కళ్ళతో 'ఊ' నన్నాడు.

అప్పుడు రాజమండ్రిలో ప్రాక్టీసు చేస్తున్నాను, ప్రారంభించి రెండు సంవత్సరాలైనా కాలేదు. అంత లాభసాటిగా లేదు ప్రాక్టీసు. అయినా వదులుకోలేక పోతున్నాను ... అప్పట్లో నాకు కొన్ని సిద్ధాంతాలంటో తగలడ్డాయి. నిజం చెప్పడమనే దురభ్యాసం నాకుంది. దురభ్యాసమని నేనెందు కంటున్నానంటే, వైద్య వృత్తిలో నిజం చెప్పడమంత మతిహీనమైన పని మరొకటి లేదు, మాటవరసకు; ఒక డబ్బున్నతనికి వాతం చేసిందనుకోండి. కాళ్ళు చేతులు కొంత - నెప్పులు పెడతాయి. చిన్న డోసుతో అది నయమౌతుంది, అలాగని అతనితో చెపితే "ఈ డాక్టరు కేమీ తెలీ"దని నిర్ణయిస్తాడు. ప్రచారం చేస్తాడు. ఆ వాతానికే మరో పది రోగాలు కలిపి, దీనికి స్విట్జర్లాండు ఇంజక్షన్సు యివ్వాలనీ, అధమం పది వారాలు మందు తీసుకోవాలనీ, నూటయాభై

రూపాయల ఫీజవుతుందనీ అన్నాననుకోండి. నమ్ముతాడు. గీసిపెట్టి బేరమాడి, ఏ వందకో ఒప్పుకుంటాడు. తొమ్మిది వారాలు రంగు నీళ్ళిచ్చి, పదోవారం ఓ డోసు మందిస్తే నా అంతవాడే లేడని నమ్మేస్తాడు...

బీదవాళ్ళుగూడా అంతే! ఊరికే యిచ్చేమందు మందే కాదని వాళ్ళ నమ్మకం. ఒకటి రెండు అసాధ్యమైన కేసులు నా దగ్గరకొస్తే యీమాటే చెప్పాను. ఈ రోగం నయం కాదన్నాను. వారు నమ్మలేదు. మరో డాక్టరు దగ్గర కెళ్ళారు, అతగాడు అందిన మేరకు పుచ్చుకొని రంగునీళ్ళిచ్చాడు.

రోగులు నాలుగు రోజులు తీసుకొని చనిపోయారు. అయినా ఒక నమ్మకం వాళ్ళవాళ్ళకు కలిగి ఉంటుంది. మందు లోపంవల్ల కాక, కేవలం తమ కర్మవల్లనే వాళ్ళు చనిపొయ్యారని.

అసలెందుకీ ప్రసక్తి వచ్చింది!... ఓహో ...... అదీ సంగతి. అవునా? అలా నేను రాజమండ్రిలో ఉంటున్నప్పుడు, ఓ సంఘటన జరిగింది. ఇప్పటికీ ఆ సంఘటనను తలచుకొని ఎంతో సిగ్గు పడుతుంటాను. అంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తించానా అని ఆశ్చర్యపోతాను. నా కేమనిపిస్తుందంటే, వయస్సుకు, కాలానికి, ఉన్న శక్తి మరి దేనికీ లేదని, కాలం గడిచేకొందికీ, మానవుడు, తన చరిత్రను చూసుకొని సిగ్గుపడుతుంటాడని. కానీ అప్పుడు - ఆ కాలంలో - ఆ వయస్సులో, ఈ ఆలోచనే రాలేదు. రాదుగూడా నేమో! వయస్సు పైబడ్డకొందికీ మనిషి ఉద్రేకాలు, ఉత్సాహాలు చంపుకొని, ఓ రకమైన మత్తులాంటి స్థితికొచ్చేస్తాడనీ, ఆ స్థితే మహోత్తమమైనదని భావిస్తుంటాడనీ నా అభిప్రాయం. మరి కొంత కాలం గడిచిన తరువాత, ఇదీ అసత్యమే, అయి ఏమీ లేని డొల్లలా కావచ్చు. అప్పటి కదే సత్యమని నమ్ముతాడు మనిషి.

ఒకరోజు నేను మామూలుగా డిస్పెన్సరీ కొచ్చాను. నా అరుగుమీద ఒక మనిషి — ఆడమనిషి పడుకొని ఉంది. 'ఎవరో నిర్భాగ్యురాలు' అనుకొన్నాను. లోపలికెళ్ళి నా పని చూసుకొన్నాను. పదకొండు గంటలకు యింటి కెడదామని బయలుదేరితే ఆ ఆడమనిషి అలాగే అరుగుమీద పడుకొని వుంది. చనిపోలేదు. ఊపిరి పీలుస్తున్నది. అయితే ఎందుకు పడుకొన్నట్లు ? డాక్టర్ను కనుక, ఇవన్నీ నాకు తోచాయి. దగ్గరకెళ్ళి చూశాను. గర్భిణీ స్త్రీ. స్పృహ లేకుండా పడివుంది. లోపలికి తెప్పించాను. పరీక్ష చేశాను. చాలా నీరసించి పోయివుంది. బహుశా కొన్ని రోజులనుండి అన్నంతిని ఉండదు. అందుకే అలా స్పృహ లేకుండా పడిపోయిం దనుకొన్నాను. మనిషి అందంగానే వుంది. వయస్సు కూడా ఆట్టేలేదు. మురికి పట్టిపోయిన గుడ్డలు, ఎండిపోయిన జుత్తు, కళ్ళనిండా దుమ్ము ఇంకేమీ లేవు. కాఫీ పోశాను. ఇంజెక్షనిచ్చాను అరగంటసేపటికి కళ్ళు తెరచింది. ఆ చూపులో ఎంత భయం ! ఎంత కృతజ్ఞత ! ! మెల్లిగా లేచి నా కాళ్ళ దగ్గరికి పాకుతోంది. చప్పున దూరంగా వెళ్ళాను. ఈ స్వల్ప సహాయానికే, ఆవిడ అంత కృతజ్ఞత చూపిస్తున్నదంటే, ఎన్నో అవస్థలు, బాధలు పడివుండాలనుకొన్నాను. నా అనుమానం నిజమయింది. లలిత చెప్పింది విన్న తరువాత, ఈ మనుషులమీద ఎంత రోత పుట్టిందని !

"మాది ఏలూరండీ !" అన్నది లలిత. "ఆయనగారు స్కూలు మేష్టరు. ఏదో ఉన్న దానితో, అలానే సంసారం గడుపుకొస్తున్నాను. కొంతకాలం క్రిందట ఆయనగారికి జబ్బు చేసింది. వాళ్ళవాళ్ళకు రెండేళ్ళ తరువాత ఉత్తరం రాశారు."

"ఎందుకని ?" అన్నాను.

లలిత కళ్ళు మూసుకొని ఆలోచించింది. ముఖం కంది పోయింది. నీటిచార కనురెప్పల అడుగున మెదిలింది. నేను చూడ

కుండా ఉండేందు కనుకొంటాను. అటు తిరిగి కళ్ళు ఒత్తుకొంది. నేనూ చూడనట్లే నటించాను.

"ఏం లేదు" ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తూ అన్నది లలిత. "నన్ను చేసుకోవటం ఆయనగారి అమ్మ, నాన్నల కిష్టం లేదు. వారిని కాదని నన్ను పెళ్ళాడినందుకు, వాళ్ళు మాతో మాట్లాడటం మానేశారు. ఆయనగారు దిగులు పడలేదు - ఉత్తరం రాసినా జవాబివ్వలేదన్నానా ? జబ్బు పెద్దదయింది. డాక్టర్లు ప్రయత్నించి లాభం లేదన్నారు. నేను ఆఖరి చూపుకోసర మన్నా రండని మనిషిచేత కబురు పెట్టాను. చచ్చిన తరువాత వచ్చారు."

నేను మాట్లాడలేదు.

"ఎంత గోల ! ఎన్ని కేకలు ! !" లలిత తనలో అనుకొంటు న్నట్లు అన్నది. "ఆయనగారి మరణానికి నేనే కారణమన్నట్టు మాట్లాడారు. అయినా విచారించను." లలిత కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. "అప్పటికే నేను ... నాకు వ్యభిచారాన్నంట గట్టారు. ఆయనగార్ని అడ్డంపెట్టుకొని, నేను తిరుగుళ్ళు తిరిగానట. వీధినబడి నానా అల్లరి చేశారు. ఇక ఆ ఊళ్ళో ఉండలేకపొయ్యాను."

"మీ అమ్మ, నాన్నలేరా ?" అన్నాను నేను.

"లేరు" లలిత బావురుమని ఏడ్చింది. "నేను దిక్కులేనిదాన్ని డాక్టరుగారూ ! నా కెవ్వరూ లేరు."

నిండు నెలల మనిషి. అలా ఏడవటం ఆరోగ్యానికి భంగమని నేనే, ఏదో పని ఉన్నట్లు వెళ్ళిపోయాను...

ఆ తరువాత లలిత ఏలూరులో ఉండలేకపోయింది. అవమాన భారంతో అక్కడ ఉండటం దుస్సహమనిపించి రాజమండ్రి వచ్చింది.

ఎవ్వరూ తెలియరు. ఎక్కడికి వెళ్ళాలో ఎవర్ని ఆశ్రయించాలో - అంతా అగమ్యంగా ఉన్నది. నిండు చూలాలు. తిండిలేదు. నిద్ర పోయేందుకు చోటులేదు. అనాథ శరణాలయానికి పొమ్మని ఎవరో అంటే, అక్కడికి వెళ్ళింది. "నీ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంది. నిన్ను చేర్చుకోలేము" అన్నారట. వీరేశలింగంగారు వింటే, ఆయనగారి నిర్మలాత్మ ఎంత ఘోషించి ఉండేదో! అలా వీధులంట, పగలల్లా తిరిగేది. ఏ గోదావరి ఒడ్డునో పడుకునేది. ఒకటి రెండు సార్లు ఆత్మహత్య చేసుకుందామనుకొంది. కానీ, చనిపోయేది తనొక్కతే కాదు. తనలో ఓ బిడ్డ! మనస్సు వేదనతో మూలిగేది. తన బిడ్డను చూసుకోవాలన్న తహతహ, ఆమెను బ్రతికించింది. అలానే రోజులు వెళ్ళబోస్తో — ఒకనాడు స్పృహతప్పి నా అరుగుమీద పడిపోయింది.

లలితకు నా హాస్పిటల్లోనే పురుడు పోశాను. చక్కని ఆడపిల్ల. తల్లీ బిడ్డా కులాసాగా ఉంటున్నారు. లలిత హాస్పిటల్లోనే ఉండిపోయింది. రోగులకు మందులూ అవీ యిస్తుండేది. చిన్నచిన్న కట్లు కడుతుండేది. ఓ గదిలో వండుకొని తింటుంది. అక్కడే పడుకొంటుంది. ఒక జీవితాన్ని కాపాడానని ఎంతగానో ఆనందించే వాణ్ణి.

అయితే —

అలా ఎక్కువకాలం సాగలేదు. ఈ లోపుగా ఊళ్ళో ఒక చిత్రమైన వార్త ప్రచారమైంది. చెప్పడానికి ఇప్పటికీ నేను సిగ్గు పడుతున్నాను. నాకూ లలితకూ సంబంధం అంటగట్టారు. ఫలానా డాక్టరు పచ్చి వ్యభిచారనీ, ముండల ముఠాకోరనీ, ప్రచారం సాగింది. దీని కెవరు కారణమో నా కిప్పటికీ తెలియదు. అయితే చాలామంది నా తోటి డాక్టర్లు ఈ వార్తను వైనవైనాలుగా,

చిలవలకు పలవలు కల్పించి వ్యాప్తి చేశారు. లలిత చక్కనిది కావటమూ, ఆవిడ నా హాస్పిటల్లోనే ఉండటమూ వారికి మాంచి అవకాశ మిచ్చింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న నా ప్రాక్టీసు ఈ దెబ్బతో తుడిచిపెట్టుకు పోయింది. అందుగ్గూడా నేనంత విచారించలేదు. కుక్కలు ఘాగడాన్ని నేను లక్ష్యపెట్టను. నాకో భయం పట్టుకొంది. దురదృష్టవశాత్తూ ఈ వార్త లలిత వింటే? ఎంత క్షోభిస్తుంది ? ఎంత దురపిల్లుతుంది ? నేను దాదాపు ప్రతిరోజూ భగవంతుణ్ణిలా ప్రార్థించేవాణ్ణి : "భగవంతుడా ! ఈ ప్రచారం లలిత దాకా పోనివ్వకు. ఆమెను కష్టాలపాలు చేయకు."

ఈ గాలి మా ఇంట్లోకి గూడా ప్రవేశించింది. ఊరంతా ఆగుబ్బుగా చెప్పుకొంటున్న విషయం, ఇంట్లో వారికి తెలియడంలో అబ్బురంలేదు. ఒకనాడు నేను మామూలుగా యింటి కొచ్చాను. మామగారు ఎవరిమీదనో యాష్టపడుతున్నారు. అలసిపోయి ఉండడం మూలాన, ఎవరిమీద విరుచుకు పడుతున్నాడో నేను కనుక్కోలేదు. భోజనం చేసి అలా కూర్చున్నాను. మా మామగారు ధుమ ధుమ లాడుతూ వచ్చి ఎదురుగా కూచున్నారు. సాధారణంగా, ఆయనగారూ నేనూ మాట్లాడుకోము. ఆ అవసరం గూడా లేదు. ఏదో అతి ముఖ్యమైన విషయముంటే తప్ప, ఆయన నా దగ్గరకు రాడు. కొన్ని నిముషాలు అలానే కూచున్నాడు. ఏదో చెప్పటానికి సందేహిస్తున్నవాడిలా తటపటాయించాడు. ఎందుకైనా మంచిదని నేనే ముందు కదిలించాను. మాట్లాడే అవకాశం కలిగినందుకు సంతోషించిన వాడిలా అవుపించాడు.

"చూడు నాయనా —" అని ఆగిపోయాడు. ఇష్టంలేనిదాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు మనమెలాంటి బాధపడతాము ! అట్లా ఖచ్చితంగా, అట్లాంటి బాధ పడుతున్నట్టు నేను ఊహించాను.

"అంతే ననుకో" అన్నాడాయన తనలో అనుకొంటున్నట్టు. "నిజమే ! నిజానిజాలు లోకానికి పట్టవు. తెలుసుకోవటానికి గూడా అది ప్రయత్నించదు. లోకం గుడ్డిదే కావచ్చు. చెవిటిదీ, మూగదీ కావచ్చు అయినా దాని శాసనాలు మనం పాటించి తీరాలి." ఎటో చూస్తూ ఆయన చెప్పుకు పోతున్నాడు.

"లలిత విషయమా" ? అన్నాను.

ఆ సంగతి నాతో చెప్పడంకోసం, ఆయనగారు పెద్దప్లాను వేసుకొని ఉండాలి. అదేమీ లేకుండా, ఒక్కసారే నేనుబైటపడే సరికి, ఆయన ప్లానంతా తలక్రిందులైంది. అలా కావటం ఇష్టం లేనట్టు ముఖం పెట్టాడు.

"అదే ! అదే ! ఆ సంగతే!" అన్నాడు తడబడుతూ. "ఎందరో ఎన్నో రకాల అంటున్నారు. వినలేక చచ్చిపోతున్నాను. ఎందుకు మనకిలాంటి అపవాదు రావాలి ? ఫలానా ఆయన అల్లుడు, ఓ ముండనుంచుకొని కులుకుతున్నాడంటే నాకెంత చిన్నతనంగా ఉంటుంది !" అని కాస్సేపాగాడు. "పంపించెయ్యి. అయిందేదో అయింది. పొరబాట్లు అందరికీ వస్తుంటాయి. అవి సర్దుకోవాలి."

నాకు నవ్వొచ్చింది. ఎంత చెప్పినా వినడు. నమ్మడు. పైగా అటువంటి పనులు చేస్తున్నవాడు, అలాగే మాట్లాడతాడట. అనవసరంగా, బుకాయించవద్దనీ, వెంటనే వెళ్లగొట్టమనీ అన్నాడు.

"అంతగా నీకు మొఖమాటమైతే, నేనే వెళ్ళిపొమ్మంటాను, ఈ నాల్గుగంటలూ నువ్వింట్లో కూచో. లేకపోతే పదిమందినీ పిలిచి గడ్డిపెట్టిస్తాను. పోలీసు రిపోర్టిచ్చి జైల్లోకి తోయిస్తాను. నువ్వలా చూస్తూ ఊరుకో" అన్నాడు.

ఇక ఆయనతో వాదించి లాభం లేదని, నేనే లేచి పొయ్యాను. తన మాట విననని ఆయనకు అనుమానం వేసింది గావును; ఈ "దుష్టకార్యం" నుంచి నన్ను తప్పించేందుకు నా భార్యను పురమాయించాడు. అదిగూడా తండ్రి అడుగు జాడల్లో నడిచి, ఆదర్శ పుత్రిక ననిపించుకొంది.

నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

"అదిగాదు సీతా! నువ్వు నిజమాలోచించు. నీతో అబద్ధం చెప్పవలసిన అవసరం నాకు లేదు. లలిత దిక్కు లేనిది. నిర్భాగ్యురాలు. ఆపదలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోబోయిందిట..."

"ఇంకేం! మీకు బాగా నూరిపోసిం దన్నమాట! ఆ మాటలు మీ తలకెక్కాయి ... గడుసుముండే! కాకపోతే మీలాంటివారిని ఎలా బుట్టలో వేసుకోగలదు లెండి?" అన్నది నా భార్య.

"ఇందులో బుట్టలో పడేటందు కేముంది?"

"ఏమి లేదు గనుక?"

"నువ్వు నన్నెందుకు నమ్మవే? నిజంగానే నేను లలితను ఉంచుకొని, ఆ మాట బహిరంగంగా నీ ఎదుట అన్నాననుకో, అప్పుడు నువ్వు చేయగలిగిందేమిటి?"

"నా ఖర్మ ఇంతేనని ఏడుస్తాను" అన్నది సీత.

"నువ్వలా చేస్తావని నాకు తెలుసు. నువ్వేడిచి నందువల్ల నాకు అడ్డిపోయే దేమీ లేదనిగూడా నాకు తెలుసు ఇహ తెలిసి గూడా నేనలా అనడం లేదంటే - ఎందుకో నువ్వు గ్రహించవేం?"

సీత కొన్ని నిమిషాలు మౌనంగా ఉండిపోయింది.

"అంతేగానీ, మీరు దాన్ని వదలనంటారు?"

"ఎందుకు వదలాలో చెప్పందే నువ్వు? నిష్కారణంగా ఇదే కాదు - ఏ పని చెయ్యాలన్నా నాకు మనస్కరించదు. నా అంత రాత్మకు నేను సమాధానం చెప్పుకోవాలి. అలాంటి సమాధానం నువ్వు ఇస్తే, నిరభ్యంతరంగా లలితను ఈ క్షణాన తోలేస్తాను. నువ్వావోమీ యివ్వగలవా?''

"పదిమందీ ఏమంటున్నారో మీకు తెలీదు."

''తెలుసు'' అన్నాను మొండికెత్తి.

''తెలిసిగూడా విన నంటున్నారంటే, దానిమీద మీరు మోజు పడ్డారని అనుకోవాలిసొస్తుంది'' అన్నది ఏడుపు ప్రారంభించి.

నాకు అసహ్యమేసింది.

''పదివేలమంది నిన్ను విడిచిపెట్టమంటే నేను విడిచిపెట్టను. ఎందుకో నీకు తెలీదు. అర్థంకాదు ... అదిగాదే! నీ ప్రవర్తన సరైంది కాదనీ, నువ్వు ఎవరెవరికో ఉత్తరాలు రాస్తున్నావనీ, రాత్రివేళ ఎవడితోనో దొడ్లో వుండగా చూశామనీ, నువ్వు చెప్పిన ఆ పదిమందీ అంటారనుకో; అది నిజంకాదని నాకు తెలుసు. ఐనా నిన్ను విడిచేస్తే, నువ్వేమనుకొంటావ్?''

మాటలు గట్టిగా తగిలాయిగావును; చేతుల్లో ముఖం దాచుకొని ఏడిచింది!

"ఇలాంటి మాటలన్నీ మీచేత అడిగిస్తున్నదంటే — అది సామాన్యపు ఆడదిగాదు...ఎన్ని చేతులు మారితే, దానికి తెలివి తేటలు పుట్టినయ్యో!'' అంది సీత. నాకు సీతను చంపేద్దామన్నంత కోపమొచ్చింది.

"నీలాగా, నేనూ నిన్ను అనుమానించడం మొదలెడితే, ఇప్పటికి ఏ వందసార్లో నిన్ను విడిచిపెట్ట వలసొచ్చేది..."

సీత ఏడుస్తూ వెళ్ళిపోయింది.

......నా కేమనిపిస్తున్నదంటే, ఒక మగవాడు ఆడది, ఒకచోట ఉండటమంటే, వాళ్ళు నైతికంగా పతనమైనట్టే యీ గుంపు చూస్తుంది. ఆ కామ సంబంధం లేకుండా, హాయిగా, సుఖంగా, నిర్మలంగా ఉండగలరని వీళ్ళనుకోరు. క్షమించండి. నా కింకో అనుమానం వేస్తున్నది. అట్లా అనేవాళ్లు కర్మం చాలక అలా కలిసివుండడం తటస్థిస్తే, ఆ స్త్రీ పురుషుల మధ్య ఒక్క కామ సంబంధం తప్ప, మరేమీ ఉండదేమో ననుకొంటాను. లేక పోతే, ఎదటివారిని గురించి, ఆ మేరకే అనుకోవడంగాని, ఆ విష యాన్ని గురించే అనుమానించటానికిగాని, కారణం కనపడదు. తమలో ఉన్న యీ కుళ్ళునంతా భరించలేక, త్యజించలేక, యిలా వాదులు పుట్టించి, కుతులు తీర్చు కొంటుంటారు. లేకపోతే ఆడది, మగాడు కలిసి ఉంటే, చెడి పోవడ మేమిటండి?

నా మాట ఎవ్వరూ నమ్మరని తేలిపోయింది. ఎవ్వరు చెప్పినా నేను విననని వాళ్ళూ రూఢిపరచుకొని ఉండాలి.

నిజంగా యిందులో గొడవ పడవలసిం దేమున్నదండి? ఒక స్త్రీ, అనాథ, దిక్కులేక, ఆదరించేవాళ్ళు లేక, అల్లాడి పోతుంటే, సాయం చేయడం తప్పా? ఎలా తప్పో ఎవ్వరూ చెప్పరు. ఇలాంటి దురవస్థ నీకు, నాకు, మన ఆడవాళ్ళకు కలిగినప్పుడు, ఎవ్వరూ చేర దియ్యకపోతే, ఏం జరుగుతుందో ఊహించుకోలేమే? ఓ దిక్కులేని స్త్రీ మీద...ఇంతమంది, ఎందుకు కత్తు కట్టారో నాకర్థంకాలేదు—

నాకు మరో భయం పట్టుకొంది. ఈ 'సువార్త' ఆ నోటా ఆ నోటాపడి లలితకు తెలిస్తే, ఆవిడ ఎంత క్షోభ పడుతుందోనని హడలిపోయాను. ఆమెను సురక్షితంగా ఉంచవలసిన బాధ్యత నా మీద ఉన్నది. వేయి కళ్ళతో కనిపెడుతున్నాను.

మనం చేసే పనులు — కొన్ని ఇతరుల ప్రేరేపణల వల్ల చేస్తుంటా మనుకొంటాను. చాలామంది లలితను వెళ్ళగొట్టమనడం వల్లనే, నేను ఎదురు తిరిగి, ఆమెను ఉంచితీరాలని పట్టుపట్టానేమో నని నా కనుమానం. ఆ జనమంతా కలిసి, లలితను ఆకాశానికెత్తితే ఆవిడలో నెరసులు వెదకడానికే ప్రయత్నించేవాణ్ణేమో? నేను చూసి జాలిపడ్డాను గనక సరిపోయింది. అదే మరొకరు చూసి, సాయం చెయ్యమంటే, సహాయం చెయ్యటానికి నేనెంతమాత్రం అంగీకరించనేమో?

ఒకనాడు కాకినాడ నుండి టెలిగ్రామొచ్చింది. రంగనాథం తమ్ముడికి తీవ్రంగా జబ్బు చేసిందిట. నన్ను రమ్మన్నాడు. రంగ నాథం గూడా డాక్టరే! అయినా నన్ను రమ్మన్నాడు. అంటే జబ్బు మామూలుది కాదన్నమాట.

సాయంత్రానికి తిరిగి వద్దామనుకొని, కాకినాడ వెళ్ళాను. రంగనాథం దోవలోనే కనిపించాడు. వాడి ముఖం చూస్తే, యింట్లో ఎవ్వరూ జబ్బుపడినట్లు లేదు. అదే అడిగాను. రంగనాథం అదిరి పడ్డాడు.

"జబ్బా! జబ్బెవరికోయ్?"

ఈ దఫా అదిరిపోవటం నా వంతయింది. జేబులోనించి టెలిగ్రాం తీసిచ్చాను. రంగనాథం కొయ్యబారి పోయ్యాడు.

"ఇది నేనివ్వలేదురా అబ్బీ! నాకు తెలీదు. ఈ వూళ్ళో మరో రంగనాథమున్నాడేమో చూదాం పద" అన్నాడు.

ఇంకో డాక్టరు రంగనాథం ఆవూళ్ళోనే లేడని తేలింది.

"లేకపోతే లేకపొయ్యాడుకాని, ఇంటికెడదాం. మనం కలుసుకొనిగూడా నాలుగైదు నెలలయింది. ఉదయం మీ మామ గారు కనిపిస్తే అడిగాను 'ప్రాక్టీసు ఏదో-అదోమాదిరిగా ఉందండీ' అన్నాడు. ఏదో కోర్టుపనుండి వచ్చాట్టగా!"

నాకు పిచ్చెత్తిపోయింది. ఈ టెలిగ్రాం ఎవరిచ్చిందీ ఇప్పు డర్థమయింది. ఇంత ప్రయత్నం ఆ ముసలినక్క చేసిందంటే దీని వెనుక ఇంకెంతో మోసం ఉండి వుండాలి. కొంపదీసి లలితను ...

ఈ అనుమానంతో; నా నరాలు తిమ్మిరెక్కాయి. వెంటనే వెళ్ళకపోతే ఏదో అన్యాయం జరుగుతుం దనిపించింది. రంగనాథం దగ్గర సెలవు తీసుకొని రాజమండ్రికొచ్చాను. హాస్పిటల్ వైపు ఒక్కొక్క అడుగు పడుతున్నకొందికీ, గుండెలు వేగంగా కొట్టుకో సాగాయి. అనుకొన్నంతా అయింది. వాకిట్లోనే భిక్షాలు పిల్లను ఆడిస్తూ కనిపించాడు. నన్ను చూడంగానే బిక్షాలు బావురుమని ఏడిచాడు.

"లలితమ్మగారు ఎటో యెల్లిపోయినారండీ!" అన్నాడు భిక్షాలు.

"ఎప్పుడెళ్ళింది ? ఎటు వెళ్ళింది ?"

"మద్దాన్నమండి ! 'ఇప్పుడే వొత్తా బిచ్చాలూ' అని యెల్లి యింకా రాలేదు, ఈ పిల్లకాయ పాలకోసం ఏడుత్తుంటే కాసిని పాలుపట్టానండీ !"

నేనేమీ మాట్లాడలేదు. మాట్లాడలేక పోయాను. వళ్లంతా చల్లబడి పోయింది. కాళ్ళు తేలిపోయాయి. బండి కట్టించుకొని సరాసరి పోలీసు స్టేషనుకెళ్ళి రిపోర్టిచ్చాను.

వాళ్ళు దర్యాప్తు చేస్తామన్నారు. ఇంటికొచ్చాను. అందరూ సుఖంగా నిద్రపోతున్నారు.

"కాకినాడ వెళ్ళారటగా - బండి లేటయిందా ?" అన్నది మా ఆవిడ నిద్రమత్తుతో తలుపు తీస్తూ.

నేను మాట్లాడలేదు.

"ఒక్క నిముషం ఆగండి. నీళ్ళు వెచ్చచేస్తాను."

"ఒద్దు"

అసహ్యాన్ని తొక్కిపెట్టి ఎలాగో అన్నాను. సరాసరి నా గదిలోకెళ్ళి తలుపు వేసుకొన్నాను. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. లలితను గురించే ఆలోచిస్తూ గడిపాను.

ఉదయం మళ్ళీ పోలీసు స్టేషను కెళ్ళాను.

"ఇంకా వెదికిస్తున్నాను సార్!" అన్నాడు యస్ ఐ.

నాకు జ్వర మొచ్చినట్టుంది. కణతలు పేలి పోతున్నాయి. ఎలాగో హాస్పిటల్ కొచ్చాను.

"ఇదేదో సీటీ లలితమ్మగారి గదిలో దొరికింది!" అంటూ బిళ్ళాలు ఓ కాయితం మిచ్చాడు.

అది లలిత రాసింది. తను ఎక్కడికో వెళ్ళిపోతోందిట. బిడ్డను జాగ్రత్తగా పెంచమనీ, ఒకటికి పదిసార్లు రాసింది. "నేను

పోవడానికి ఎవ్వరూ కారణం కాదు, మీరు ఎవ్వర్నీ అనుమా నించకండి. మీమీద అపవాదులు ప్రచారం కావటం సహించలేను. అందుకే పోతున్నాను. దిరిగి ఎప్పటికైనా వస్తాననుకోంటున్నాను. ఒకవేళ రానేమో? రాలేనేమో? ఇదే తుదిసారి కావచ్చు. నా బిడ్డను మీకిచ్చి పోతున్నాను. సాకండి. దానికి గూడా నాలాంటి గతి పట్టకుండా చూడండి. నేను బిడ్డను పెంచలేను. నాకా అదృష్టం లేదు. ఎప్పటికో, భగవంతుడు దయతలిస్తే తిరిగి కలుసు కుంటాను." ఇదీ ఉత్తరం. ఈ పంక్తులు కొన్ని వందల సార్లు చది వాను. పతనమైపోయిన మానవాత్మ ఘోష, ఆ ఉత్తరం నాకు వినిపించింది.

మధ్యాహ్నానికే తెలిసింది అసలు సంగతి. భిక్షాలు పరుగెత్తు కుంటూ వచ్చి, ఈ వార్త చెప్పాడు.

"ఎవరో ఆడమడిసంట బాబూ! గోదార్లోపడి పాణాలొగ్గే సిందటండీ! శానామంది యెల్లి సూసొత్తుండారు. ఎఱ్ఱగా సన్నగా, వుందంటండయ్యా"!

తల పగిలిపోయింది. ఆలోచనలేదు, కదలికలేదు.

"చూసొద్దాం వత్తారంటండీ!" భిక్షాలన్నాడు.

నాకు పోబుద్ధి కాలేదు. అందంగా, మబ్బుముక్కలాగా, ముద్దబంతి పువ్వులాగా ఉండే లలితను చూసిన కళ్లతో, నీళ్ళలో నాని, ఉబికి, చీకిపోయిన లలితను చూడలేను ...

మొన్న మొన్నటివరకూ, లలితబిడ్డ ఆర్ఫనేజ్‌లో ఉండేది. ఇటీవలే టైఫాయిడొచ్చి చచ్చిపోయిందని, ఆర్ఫనేజ్ మేనేజరు ఉత్తరం రాశాడు.

* * *

డాక్టరు చెప్పటం ఆపాడు. వర్షమింకా కురుస్తూనే ఉంది. కొవ్వొత్తి కరిగి, నీరయిపోయింది. దారపుముక్క ఓ ప్రక్కకు జారి మినుకుమంటూ వెలుగుతున్నది. నారయ్య ఓ మూలకెళ్ళి చుట్ట తగలేస్తున్నాడు. గాలి బరువుగా, చల్లగా పదునుగా లోపలికి పొడుస్తోంది. చలపతిరావు వొంగి కొవ్వొత్తికి సిగరెట్ ముట్టించాడు. కొవ్వొత్తి ఆరిపోయింది. తారులాంటి కారుచీకటి. చల్లని వాన గాలి. బైట జడివర్షం నారయ్య చుట్టవాసన హాలంతా ఆక్రమిస్తున్నది. పొగ పీల్చినప్పుడల్లా చుట్ట ఎర్రగా మండుతోంది. ఆ వెలుగులో పీనుగులాంటి నారయ్య దయ్యంలా అవుపిస్తున్నాడు.

"నారయ్యా!"

గప్పున పొగ వదలి "బాబూ!" అన్నాడు నారయ్య.

"ఇంకో కొవ్వొత్తి వెలిగించు"

"లేదండీ బాబూ!" అన్నాడు నారయ్య.

"కరెంటెప్పటి కొస్తుందో ఫోన్‌చేసి కనుక్కో"

"వైర్లు తెగిపోయా యనుకుంటానండీ. ఎన్నిసార్లు పిలిచినా పలకటం లేదు."

బైటి ప్రపంచానికీ తమకూ సంబంధం తెగిపోయిందని జ్ఞాపక మొచ్చి ఉలిక్కిపడ్డాడు అడ్వకేటు ప్రభాకరరావు. బైట జడివాన. కళ్ళుపొడిచే మెరుపులు; ఉరుములు గుండెలదర కొడుతున్నాయి. లోపల, ఆ నలుగురూ, నిశ్శబ్దంగా, నిద్రలో జోగుతున్నట్టుగా, అంతర్జీవితాలను వెలికి తెచ్చుకొంటూ, తెచ్చుకొని ఏదో భారం తీరి నట్లు అనుభూతిని పొందుతున్నారు. ఆ ముగ్గురూ, చిరపరిచితులే! రోజూ, క్లబ్బులో కలుసుకొంటూనే ఉంటారు. ఎప్పుడూ ఇలాంటి

''అనుచిత'' విషయాల గురించి మాట్లాడుకో లేదు. బహుశః ఆ అవసరం కలగకపోవచ్చు. ఆ రహస్యాలను వెలికి తోడగల పరి స్థితులు లేకపోవచ్చు. ఎన్నడూ ఏ విషయంలోనూ బైట పడనివారి దగ్గర యిట్టే బయటపడతాయి. ''ఎందుకని''? అని అడిగితే, వారూ చెప్పలేరేమో? అలా నిజ జీవితాన్ని రహస్యంలో భరించలేని, ఏ శక్తో, ఆ నిముషాన విజృంభించి, మాయ తెరనుండి సత్యాన్ని వెలికి తీసి ఉంటుంది.

''డాక్టరుగారూ!'' అన్నాడు అడ్వకేటు ప్రభాకరరావు నెమ్మదిగా. ''దుగ్గంపాడు జమిందారు చనిపోయి ఎన్నేళ్ళవుతుం దంటారు?''

డాక్టరు దేనికోసమో కళ్ళు పెద్దవిచేసి, ప్రభాకరరావు ముఖం వెదికాడు.

''రెండేళ్ళవుతుం దనుకొంటాను!''

''సరిగ్గా అప్పటికి మూడేళ్ల క్రిందట —'' ఆగిపోయాడు ప్రభాకరరావు. నారయ్య తడుముకొంటూ దగ్గిరకొచ్చాడు. చలపతిరావు ఒళ్ళు గరిపొడిచింది. ఏదో థ్రిల్లింగ్ జరగబోతుందన్న నమ్మకం కుదిరినవాడిలా ముడుచుకు కూర్చున్నాడు.

## 3

''అంతే'' అన్నాడు అడ్వొకేటు.

అప్పుడు జమీందారుగారికీ, రైతులకూ కమతాల విష యంలో పేచీ వచ్చింది, అది తీర్చడం కోసరం కొంతమంది పెద్ద మనుష్యులు ముందుకొచ్చారు. దురదృష్టవశాత్తూ ఆ సమస్య పరిష్కారం కాలేదు. కాలేదు సరిగదా పెద్దగొడవయి పోయింది.

నిజం మాట్లాడాలంటే, యిద్దరూ శక్తికలిగిన వాళ్ళే. జమిందారు దగ్గర డబ్బుంది. అధికారుల ప్రాపకం వుంది. పోలీసులు, కోర్టులు, న్యాయశాస్త్రం అతని పక్షాన పనిచేస్తాయి. రైతులు ఇందుకు భిన్నమైన స్థితిలో ఉన్నారు ... ఇప్పటివరకు ఈ రహస్యం ఎవ్వరికి తెలియదనుకొంటాను; ఒకవేళ తెలుసునేమో నాకు తెలీదు. జమిందారు ఒకరిద్దర్ని కాల్చిపారేశాడు. పోలీసుల్ని పిలిపించి, పైగా రైతులమీద కేసు పెట్టాడు. ఇది జరిగిన మూడు నాలుగు రోజులకే రాజాగారి స్వంత కమతంలోని పంటంతా నాశనమైంది. కొన్ని వేలరూపాయల ఖరీదుచేసే, గడ్డివాములు తగలడి పోయ్యాయి.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఆ కేసు సందర్భంలో నన్ను వాదించమని జమిందారుగారు చాలా చాలా అడిగారు. ఒకరిద్దరిచేత చెప్పించారు. ఎంతో డబ్బు ఆశ చూపించారు. నిజంగా నాకెంత మాత్రం ఇష్టంలేదు. ఎందుకంటే, రైతులు అడిగింది శిస్తు కొంచెం తగ్గించమని. అలా తగ్గించిన మొత్తమంతా కలిపి పోలీసులకు లంచమిచ్చిన దాంట్లో పదోవంతుండదు. పైగా మదరాసు చుట్టూ, ఎన్నిసార్లు తిరగవలసి వస్తుందో చెప్పలేం గదా! వేలకువేలు కాల్చేసుకోవాలి. ఇంతా నష్టపడేకంటే, ఆ కాస్త తగ్గింపుకూ ఒప్పుకుంటే పోదా అని నా అభిప్రాయం. కానీ జమిందారు దీని కొప్పుకోలేదు. "డబ్బుకంటే ముఖ్యం ప్రిస్టేజీ'' అన్నాడాయన. నాకు నవ్వొచ్చింది. "ఇదే గావును ప్రిస్టేజీ అంటే" అనిపించింది.

ఎలాగో ఒప్పుకొన్నాను. ఎట్లా ఒప్పుకున్నానో జ్ఞాపకం లేదు. నిజం చెబుతున్నాను భాయీ! మా ప్లీడర్లకు బొత్తిగా ఆత్మలుండవనుకో. న్యాయం ఎదిరి పార్టీదని మాకు తెలుసుననుకో.

మా క్లయింటు పరమ దొంగనీ, లుచ్ఛా అనీ, లఫూట్ అనీ గూడా మాకు తెలుసు. కోర్టులో - అందులోనూ - న్యాయా న్యాయాలు భగవంతుని ముఖం చూచి చర్చించవలసిన కోర్టులో, మేము చెప్పే అబద్ధాలు, దొంగకూతలు, బూకరింపులు ... తలుచు కుంటే ... చావటానికి గూడా మాకు హక్కు లేదనిపిస్తుంది. మాలో చాలామందికి 'హృదయం' ఎప్పుడో ఎగిరిపోయి ఉంటుంది. అసలు - అది లేనివాడే న్యాయవాది కాగలడేమో ననుకొంటాను. అథవా ఏ మూలన్నా కాస్త మానవత్వ మనేది ఉంటే, ప్రాక్టీసు మొదలెట్టిన నాలుగైదు మాసాల్లో రాడార్‌కు అందకుండా పోతుంది. మాకు డబ్బే ప్రధానం. ఎవడెక్కువ డబ్బిస్తే వాడిదే న్యాయమని వాదిస్తాం. వాడిదే ధర్మమని నిరూపించబోతాం. మీరు మరోలాగా అనుకోకండి. మాకంటే వేశ్యలు చాలా నయం. డబ్బిచ్చినవాడు వేశ్యకు మన్మథుడు. డబ్బిచ్చినవాడు మాకు "ధర్మ మూర్తి." డబ్బు లేనిదే వేశ్య ముట్టుకోనివ్వదంటారు. నిజమేమో చెప్పలేను గానీ, డబ్బులేనిదే మేము మట్టుకు కేసును ముట్టుకోం. మాకు తెలుసు న్యాయం అతగాడిదేనని. కానీ లాభమేమిటి? వాడు దరిద్రుడు, మాకు ఫీజివ్వలేడు. అంచేతే అలాంటి వాళ్ళ కేసుల్ని టేకప్ చెయ్యం. మా దృష్టిలో దరిద్రుడికి న్యాయం పొందే హక్కు లేదు. ఎక్కడో ఒకరిద్దరు మహానుభావులు దరిద్రుల తరపున వాదించవచ్చు. అంతమాత్రాన అయిందేమీ లేదు.

సరే! చెప్పవలసిందానికి బదులు మరో ధోరణిలో కెళ్ళాను. ఏమిటంటే - ఆ కేసు సందర్భంలో నేను మదరా సెళ్ళాను. దుగ్గం పాడు రాజుగారికి మదరాసులో మూడు బిల్డింగు లున్నాయి. రెండింటిని అద్దె కిచ్చారు. ఒకటి రాజాగారి క్రిందనేఉంది. మదరాసు వచ్చినప్పుడల్లా రాజాగారు అక్కడ మకాం చేస్తారట.

ఆ భవనం - నేను కవినైతే గంటలగ్గంటలు వర్ణించేద్దును. అద్భుత మనుకోండి. ఒక్క మనిషికి, అంత పెద్ద బిల్డింగు, అన్ని వేల రూపాయల ఖర్చు చరు, ఇరవై మంది నౌకర్లు, రెండు కార్లు - ఎంత వేస్టు!

మా వాయిదా ఇంకా పది రోజులుంది. ఈ పది రోజులూ, మేము గెలవడానికి గల పాయింట్సు ఆలోచించాలని రాజాగారి ఉద్దేశం. రోజుకు వందసార్లయినా అతగాడు ఈ మాట అనేవాడు. నాకు తలనెప్పెత్తు కొచ్చేది. అదీగాక ఆయన మాటి మాటికీ వందరూపాయల నోట్లు నా కళ్ళముందు ఊరికే ఝళిపిస్తుండేవాడు. 'డబ్బుపెట్టి నిన్ను కొనేశానోయ్ కుంకాయ్' అన్నట్లుండేది ఆయన చూపు. నిజంగా అలా — చూడాలని ఆయన అభిప్రాయం కాకపోవచ్చు. కానీ నా కల్మషాత్మ నా కలాంటి 'దురుద్దేశం' కలిగించేది.

నన్నొక పక్క తోముతూనే, మరొక పక్క నేను విసుక్కోకుండా, నొచ్చుకోకుండా జాగ్రత్త పడేవాడు. నన్ను సంతోష పెట్టాలని ఎంతో ప్రయత్నించేవాడు. ఎంతో డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెట్టేవాడు.

ఒకనాడు నేను మామూలుగా వరండాలో తిరుగుతున్నాను. గేటు దగ్గర కారాగింది. రాజాగా రొస్తున్నారను కొన్నాను. అందులోంచి ఓ నౌకరు, అతని వెనక ఓ ఆడది, దిగారు. కారు వెళ్ళిపోయింది. ఆవిడ జమీందారుగారి భార్య కాదని తెలుసు. మరెవరో అన్న అనుమానం ఒక్క క్షణకాలం మెరిసింది. ఎవరైనా కావచ్చు. ఆయన జమీందారు, లక్షల కధికారి. డబ్బుతో కొన గలిగిన సౌఖ్యాలన్నీ ఆయన కందుబాటులో ఉంటాయి. నేనను కున్నదే నిజమైతే - ఈ స్త్రీ గూడా అలాంటి సౌఖ్యాల్లో ఒకటి కావాలి.

వాళ్ళిద్దరూ దగ్గరకొచ్చారు. నౌకరు నావేపు చూసి నవ్వాడు. ఎన్నడూ నవ్వనివాడు, నేనంటే భయపడేవాడు మరి... నేను ముఖం తిప్పుకొన్నాను. ఆవిడ నావేపు చూసినట్టు అనుమానం. నా మనస్సు పరిపరివిధాల పోయింది. కొంచెం సాహసం చేసి, 'ఆవిడ వేపు ఎందుకు చూడలేదా' అనుకున్నాను. చూడనందుకు ఏదో పోగొట్టుకొన్నవాడిలా, తపన పడ్డాను. ఇప్పుడేమనుకొంటే ఏం లాభం?

ఆవిడ మెత్తగా చప్పుడు చేసుకొంటూ మరోగదిలో కెళ్ళి పోయింది...

ఇంకో ముసలాడొచ్చి చేతులు కట్టుకొని దూరంగా నిలు చున్నాడు.

"ఏమిటి?"

వా డేదో గొణుగుతూ చాలా చెప్పాడు. కొన్ని బొత్తిగా వినపడ లేదు. వినపడినదాన్నిబట్టి నే నర్థం చేసుకొన్నదిది; రాజా గారు ఈ పూట రారు. అథవా వచ్చినా ఏ తెల్లవారుజాముకో గాని అది జరగదు. చాలా పొద్దుపోయింది గనక, నౌకర్లందరూ పడుకుందుకు వెళ్ళారు, అతగాడూ వెడతాడట.

"సరే!" అన్నాను.

వాడు వెళ్ళటానికి ప్రయత్నంచేసి, మానేశాడు.

"తమ దయ'' అన్నాడు, విశాలంగా నవ్వి చేతులు నలుపు కొంటో. నాకు చిరాకేసింది. డబ్బుకోసం ఏడుస్తున్నాడనుకొని పది రూపాయలు వాడి ముఖాన పారేశాను. సంతృప్తిపడ్డట్టు లేదు. జమీందార్ల కేకాక, వాళ్ళ గాలిసోకిన వాళ్ళగ్గూడా డబ్బంటే లక్ష్యం

వుండదు గా బోలనుకొన్నాను. గొణుక్కొంటూ నౌకర్ల పెద్దు వేపు వెళ్ళాడు.

కాసేపు అలా తిరిగి నేను లోపలికొచ్చాను. మనస్సంతా వెచ్చబడినట్టుంది. మధ్యాహ్నం సగం చదివి విడిచిన ఓ కథ చదువు దామని ప్రయత్నించాను. చదవబుద్ధి గాలేదు. ఇరవై పేజీలు చదివినా 'విమలా—మోహన్' ప్రేమించు కొంటూనే ఉన్నారు. లేచి నా గదిలో కెడదామనుకొన్నాను. బద్ధకం, సోమరితనం. ఆ గదే ఇక్కడకొస్తే బావుండుననిపించింది. ఏమీ తోచక సిగరెట్టు ముట్టించాను. నా వీపు వెనక గాజుల చప్పుడు. తలుపు తెరుచు కొన్న ధ్వని. తల తిప్పే పరిమళం. ఇక సిగరెట్టు చేతిలో ఉండ వన్నది. అటు చూడకుండా ఉండలేక పోయాను. నా గదిముందు పెద్ద చారగా గదిలో నుంచి వెలుతురు పడుతోంది. క్షణం సేపు ఎవ్వరూ కనపడలేదు. ఏ ధ్వనీ వినపడలేదు. అయినా నేను ముఖం తిప్పలేక పోయాను. ఎవరికోసమో నా కళ్ళు వెదుకు తున్నాయి. ధ్వనికోసం చెవులు తొక్కిసలాడాయి. కాగితం మడిచి కిందికి విసిరేసిన శబ్దం — గాజుల వొత్తిడి, కొత్తచీర నలిగిన ధ్వని తలతిప్పే వాసన, అందంగా - అంతకంటే మంచి శబ్దం నేను వాడ లేక పోతున్నాను. - ఆ చారలోకి నీడ పడేట్టు ఆవిడ నడిచివెళ్ళింది. జాజ్వల్యంగా మండిపోతున్న విద్యుద్దీపపు కాంతి, ఆమెనిండా కురిసి, మెరిసి, గోడలకు కొట్టుకొని, నీడల కింద మారిపోయింది...

నాలో ఏదో వెర్రితనం కేకవేసినట్లయింది. చుట్టూ ఉన్న పరిస్థితులు జ్ఞప్తికొచ్చాయి. ఊరికి దూరంగా, సముద్రం వొడ్డున రాజాగారి భవనం, చుట్టూ అడివిలాంటి తోట, సముద్రపు రొద, ఓ కొసకు చేరుకున్న నౌకర్లు, ఒంటరితనం, ఎదురుగా అందమైన స్త్రీ, ఎవ్వరూ రారన్న ధైర్యం; ఊహించుకోండి మనిషి ఏమై పోగలడో?

నేనదే అయ్యాను. ఎలాగో ఆ గదిలో కెళ్ళాను ఆగది నాదే! ఇక్కడున్నంత కాలమూ, నన్నీగది వాడుకోమని రాజాగారన్నారు.

ఆవిడ గదిలో ఓ మూలగా నుంచొంది. నేను రావటం గమనించనట్టే ప్రవర్తించింది. అది ఆశ్చర్యమో, ఆవేశమో, కామమో, పశుత్వమో, ఇవన్నీనో, కాక మరేమిటో, నాకు తెలీదుగానీ, అలా చూశాను. అద్భుతమైన సౌందర్యం. పసుపు, తేనె, మీగడ కలిపి భగవంతుడామె శరీరాన్ని చేసిఉంటా డనుకొన్నాను. కొంచెం సన్నగా, మెరపులా ఉంది. నీలి జరీ చీర లోంచి ఒళ్ళు కనబడుతోంది. చారెడేసి బంగారు పువ్వుల జాకెట్టుమీద, వెలుతురు పడి చిందిపోతుంటే, ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్టు చంపలమీది వెంట్రుకలు గిలగిల లాడుతున్నాయి. మెల్లిగా తలెత్తి నా వేపు చూసింది.

ఈ స్త్రీ, ఇంత సౌందర్యంతో, యౌవనంతో, నాకోసం, ఇక్కడ, ఎదురు చూస్తున్నదన్న భావం - నన్ను పిచ్చివాణ్ని చేసింది. దగ్గరగా వెళ్ళాను. ఓ అడుగు వెనక్కు వేయాలన్న ప్రయత్నాన్ని ... కౌగలించుకొన్నాను. గువ్వలా ఇమిడిపోయింది. రెండు చేతులతోనూ ముఖాన్ని పైకెత్తి కళ్ళల్లోకి చూశాను. ఆవిడా చూసింది. అప్పు డేమనుకొన్నానో జ్ఞాపకం లేదు. అలాంటి చూపుకు ఇప్పుడైతే "నిర్లజ్యం" అని అర్థం చెప్పుకొనేవాణ్ని,

ఆ రాత్రి ఎలా గడిచిందో తెలీదు. నీలవేణితో గడిపిన ఆ ఘడియలు, నా జీవిత మంతటిలోకీ, అమూల్యమైనవిగా ఇప్పటికీ భావిస్తుంటాను. జీవితంలో అత్యంత మాధుర్యమైన క్షణాలు నీలవేణి నాకు రుచి చూపించింది. ఆ మహత్తరమైన అందం, నవ్వేతీరు పెదిమలు కలిపే నేర్పు, పురుషుణ్ని, స్వప్న సీమల్లోకి విసిరే

ఆలింగనం — కళ్ళల్లోకే చూస్తూ, గుండెలు విచ్చిపోయేలా, నవ్వడం - ఒక్క నీలవేణికే చాతవును.

నా కోరికమీద, నీలవేణిని ఇక్కడే ఉంచటానికి రాజాగా రంగీకరించారు నౌకర్ల నందర్నీ దూరంలోకి తరిమేసి, మే మిద్దరమే ఆ విశాలభవనంలో ఉండేవాళ్ళం. నా పలుకుబడిని వినియోగించి కేసును మరో ఇరవై రోజులకు వాయిదా వేయించాను. నే నంటే నీలవేణి కెంతో యిష్టమట. ఆ మాట ఆమె అన్నప్పుడు, నేను మూర్ఛపోయ్యా ననుకోండి ... ఇంక కాలము, చోటు, ఉనికి, ప్రపంచం, రైతులు, కేసు, ఏమీ లేవు. అవన్నీ కరిగిపోయి, వాటి స్థానంలో నీలవేణి నిలిచింది.

ఒక రోజున ఆమె జీవితాన్ని గురించి అడిగాను. ఎంత నిర్లక్ష్యంగా నవ్విందని! కొన్ని వందలేండ్లు తపస్సు చేసినా మన మలా నవ్వలేము. నవ్వాలంటే, నీలవేణికున్న పరిస్థితులు మనకూ ఉండా లనుకొంటాను.

"ఆఁ. నాదేమిటి లెండి!" అని చప్పరించేసింది.

కాదు కూడదు చెప్పమన్నాను.

"తెలుసుకోవాలని ఎందుకంత కుతూహలం?" అన్నది కనుబొమ్మలు విల్లులా వంచి.

జవాబుకోసం గింజుకున్నాను. నిజంగా - నే నప్పుడెందు కంత కుతూహల పడ్డానో, ఇప్పుడాలోచిస్తే, స్వల్పమైన కారణం కనబడుతోంది. ఏదీ తెలియకుండా దాస్తోంది కనక ఏదో ఉంటుం దన్న భ్రమనుకొంటాను నా కుతూహలానికి కారణం.

ఏదో చెప్పింది. అప్పట్లో నేనది మనస్ఫూర్తిగా నమ్మాను. ఆట్టే ఆకర్షణీయమైన చరిత్ర కాదు. డబ్బుకోసం ఈ వృత్తి అవలంబించానన్నది.

"అంత మాత్రాన డబ్బే నాకు ప్రధానంకాదు" అన్నది. ప్రేమించాననీ, మోహించాననీ, నా హృదయం నువ్వు దొంగిలించావనీ, నా మనస్సునిండా నీ రూపమేననీ, ఆవిడ అనలేదు. అన్నా నేను నమ్మి ఉండను. యధార్ధం చెప్పింది. ఇద్దరు తమ్ము ళ్ళున్నారట. తల్లి టి. బి. పేషెంటు. తండ్రికి పెరాలిసిస్. జీవనం గడవక, యిలా తయారైంది. ఏ మాత్రమో చదువుకొంది గూడాను.

"ఈ పని నీకు నీచమనిపించటం లేదా"? అన్నాను ఒకసారి.

జవాబుకు బదులు నవ్వింది.

ఎంతోమంది, ఎన్నో అన్యాయాలు అక్రమాలు చేస్తున్నారు, హత్యలు, యుద్ధాలు చేస్తున్నారు. దొంగతనం చేస్తున్నారు. వాటి నన్నింటినీ నేను ఆమోదిస్తున్నాను. నీలవేణి ఎవ్వరికీ, ఏ పాటి హాని చెయ్యలేదు. ఎవ్వరి నుండి ఏదీ దొగిలించలేదు. ఎవరినీ హత్య చెయ్యలేదు. కానీ, 'ఈ పని నీకు నీచ మనిపించటం లేదా ?' అని ఆమె నడిగాను. నిజంగా ఆమెను అడగటం కాదు. నన్ను నేనే ప్రశ్నించు కొన్నాను. లోకంలో జరుగుతున్న ఈ కోట్లాది అన్యాయ కార్యాలు, న్యాయసమ్మతమేనని, నాకు నేను నచచె చెప్పుకొనే ప్రయత్నంలో, లేదంటున్న నా ఆత్మఘోష ను భరంచలేక, నీలవేణిని అలా అడిగి ఉంటాను.

'వ్యాపారం' అనేది ఆమోదయోగ్య మయినప్పుడు, నీలవేణిని తప్పుపట్ట నవసరం లేదనుకొంటాను. మామూలు వ్యాపా రంలో, మోసానికి వంచనకు తావున్నది. నీలవేణి పట్ల ఇవి చెల్లవు. ఆమె మోసగించాలన్నా, ఎవ్వరినీ మోసగించలేదు. ఆమె అందం నచ్చినవాళ్ళు, యవ్వనం కోరిన వాళ్ళు ఆమెకు 'డబ్బిస్తారు'

తను డబ్బు పుచ్చుకొన్న వాళ్ళకు సంపూర్ణ తృప్తి నివ్వటంలో ఆమె ఏ గొప్ప వ్యాపారస్తునికీ తీసిపోదు. కొందరు డబ్బు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తున్నారు. ఇంకొందరు తమ శరీరాలనే పెట్టుబడికింద మార్చుకొని వ్యాపారం చేస్తున్నారు. మొదటివర్గం రాను రాను డబ్బుతో బలిసి పోతుంటే, రెండవ వర్గం క్రమంగా క్షీణించి, భయంకరంగా, దారుణంగా నశించి పోతోంది ...

మా కేసు ఘోరంగా ఓడిపోయింది. దీనికి కారణం నేనేనని దుగ్గంపాడు జమీందారు నా మీద మండిపడ్డాడు. అతని కోపం న్యాయమే ననిపించింది నాకు. నీలవేణి గొడవవల్ల నేను సరిగ్గా ఆర్గ్యూ చెయ్యలేక పొయ్యాను. నా క్లయింటుకు నేను 'ద్రోహం' చేసినందుకు చాలా విచారించాను.

మదరాసునుండి వచ్చేనాడు, నీలవేణిని చూద్దామనిపించింది. ఆమె చెప్పిన యింటి అడ్రస్ మరిచిపోయాను. రెండు రోజులు ఆమెను వెదకడం కోసరమే ఉండిపొయ్యాను. ఓ సాయంత్రం 'సినిమా సెంట్రల్' ముందు కనిపించింది. వెంట ఎవరో కుర్రాడున్నాడు. నన్ను చూసి విశాలంగా నవ్వింది. అతనితో ఏదో చెప్పి నా దగ్గరకొచ్చింది.

"మీ రప్పుడే వెళ్ళారనుకున్నాను" అన్నది పళ్ళు కనపడేలా నవ్వుతూ.

ఆమెతో గడిపిన రోజులు, ఆ సంఘటనలు, కళ్ళల్లో మెరిశాయి. నెత్తురు గోళ్ళచివరి కొచ్చింది. జేబులోనుంచి నోట్లు తీసి ఆమె కివ్వబోయాను. నీలవేణి ముఖం ముడుచుకొంది. కనుబొమలు చిట్లించింది.

"ఎందుకూ?" అన్నది విడ్డూరంగా నన్ను చూసి.

ఎందుకని చెప్పను? సమాధానం కోసం తన్నుకొన్నాను. కోర్టులో ఎదటి ప్లీడరును గడగడ లాడించే నా బుద్ధి, నీలవేణి ముందు దమ్మిడీకి పనికిరాలేదు.

"అయ్యగారిచ్చారు - ఎక్కువే ఇచ్చారను కొంటున్నాను. ఇంకా మీ దగ్గర తీసుకోనా?"

ఫక్కున నవ్వింది. అభిమానంతో నేను కుంగిపోయ్యాను.

"వస్తానండీ! పిక్చరు మొదలెట్టే వేళయింది'' అని పోబో యింది నీలవేణి.

"అతను - అదే - అక్కడి నుంచున్నతను - ఏమన్నా అను కొని పోతాడని, నువ్వు తీసుకోవటంలే దనుకొంటాను." అన్నాను. కోరలు చాస్తున్న జెలసీ భూతాన్ని తొక్కిపడుతూ. నీలవేణికది అవమానంగా తోచివుంటుంది; చిత్రంగా నావేపు చూసింది. ఆ చూపులో, నేను నా హీనత్వాన్ని చదువు కొన్నాను. నీలవేణి యింకోమాట లేకుండా, గిరుక్కున వెనక్కు తిరిగి, విసవిసా అతని దగ్గర కెళ్ళింది. అత నేదో కోపంగా అడగడం నేను గమనించాను. దానికి నీలవేణి ఏమి చెబుతుందో తెలుసుకోవా లనిపించి, దాపులో కెళ్ళాను. అతని చేయిపట్టుకొని ఉత్సాహంగా ఊపుతూ, ఫక్కున నవ్వింది నీలవేణి.

మరుక్షణం నేను ముఖం తిప్పుకొన్నాను. చివరిసారి, ఇలాంటి చిరునవ్వు మనస్సులో చిత్రించుకొందామనే, నేను నీల వేణి కోసం వెదికాను. ఆ చిరునవ్వు లభించింది. మద్రాసులో ఉండబుద్ధి కాలేదు. ఆ రాత్రే మెయిలెక్కాను. క్షణక్షణానికి నీలవేణికి దూరమౌతున్నానన్న భావం, నన్ను పట్టిపీడించింది. ఆమెతో గడిపిన గంటలు గుర్తుకొచ్చాయి. అలాటి అమరసుఖం

ఈ రాత్రి — వాడూ అనుభవిస్తాడు ... ఈ ఊహ నన్నుక్కిరిబిక్కిరి చేసింది. కణతలు లోపలికి తోసుకొస్తున్నట్లు బాధ పడ్డాను. పోతోన్న రైల్లోంచి కిందికి దూకుదా మనిపించింది. కానీ ఏమీ జరగలేదు. ఏమీ చెయ్యలేదు. నిరపాయంగా యింటి కొచ్చాను.

ఆ తరువాత, నీలవేణికోసం ఒకటి రెండుసార్లు మదరాసు వెళ్ళాను. ఆమె కనిపించలేదు. అప్పటికీ ఇప్పటికీ...

* * *

ఠప్పున లైట్లు వెలగాయి. ప్రభాకరరావు వాక్యం పూర్తి చెయ్యకుండా చావుభయంతో చుట్టూ చూశాడు. చాలా సేపటి నుండి వెలుతురు చూడకపోవటం మూలాన, కళ్ళు రవంత మంట పుట్టాయి. నారయ్య రెండు చేతులూ జోడించి దీపానికి దణ్ణం పెట్టాడు. చలపతిరావు బరువు మోస్తున్న వాడిలా కుంగి పోయి నట్టున్నాడు. డాక్టరు కళ్ళజోడు తీసి డ్రాయరు మీద పెట్టి, కళ్ళు గట్టిగా నులుముకున్నాడు. వాననీరు చారలు చారలుగా లోపలి కొచ్చి, వెలుతురుకు మెరుస్తోంది. వాన ఎప్పుడో ఆగిపోయింది. మాటల సందడిలో, ఎప్పుడాగిందో ఎవ్వరూ గమనించలేరు.

నారయ్య తలుపులు తీశాడు. చలిగాలి రయ్ మనిపించింది. అక్కడక్కడ నీటిమబ్బులు - చంద్రుడు మసగ్గా చూస్తున్నాడు. క్లబ్బు చుట్టూ నీళ్ళు, కప్పలు — ఓ - రొద పెడుతున్నాయి. చంద్రుడు అలలమీద పడి ముక్కలయి పోతున్నాడు. తుమ్మచెట్టు మీద ఓ పిట్ట అరిచింది.

"ఇందాక," అన్నాడు ప్రభాకరరావు లేచి కోటు తొడుక్కుంటూ. "క్లబ్బుకొస్తున్నప్పుడు గాంధీచౌక్‌లో నీలవేణి కనిపించింది."

"నిజంగానా?" అన్నాడు చలపతిరావు ఆశ్చర్యంగా.

"ఆహా!" శవం నవ్వినట్టు నవ్వాడు ప్రభాకరరావు. "నేనే గుర్తుపట్టలేక పొయ్యాను. ఘోరంగా మారిపోయింది..." ఒక్క క్షణం ఊపిరిపోసుకున్నట్టు ఆగాడు. "నల్లగా సన్నగా అయిపోయింది. ఏదో జబ్బు గావును; నడుము వంగిపోయింది. వళ్ళంతా మచ్చలు. గోళ్ళు ఊడిపోయి మాంసం కనిపిస్తున్నది. జుట్టు రాలిపోయింది. మాడు తెల్లగా, పురుగు కొరుక్కు తిన్నట్టుంది. నా గుండె ఆగిపోయింది. పుటిక్కిన గుర్తుపట్టి పిలుస్తుందేమోనని చాటుచాటుగా పారిపోయొచ్చాను. ఎంత బాధ పడ్డానని!!'

"ఒకప్పుడు ఆమెను చూడాలని, రెండు రోజులు తెగ తిరిగాను. ఆమెకోసం మదరాసుగూడా వెళ్ళాను ... ఇప్పుడు ఆమె చూస్తుందేమోనని హడలెత్తి, దొంగచాటుగా వచ్చాను. దానికి దీనికి మధ్య అంతరం ఆరేళ్ళు" ముఖాన్ని గట్టిగా రుద్దుకున్నాడు ప్రభాకరరావు.

"మల్లా వానొచ్చుద్దేమో బాబూ!" నారయ్య, భయపడుతూ భయపడుతూ అన్నాడు.

ముగ్గురూ బైటికొచ్చారు. నారయ్య లైట్లు ఆర్పుతున్నాడు.

"లోపలున్నాం గనక మనకు తెలియలేదుగానీ, వర్షం దిట్టంగా కురిసిందండి!"

పంచెలు ఎగదోపుకొని, పాదరక్షలు చేతపట్టుకొని, ముగ్గురూ నీళ్ళలోకి దిగారు. మోకాళ్ళదాకా వచ్చింది నీరు. రోడ్డంతా బురద. రత్నహోలు దగ్గర మాత్రం ఒకదీపం వెలుగుతోంది.

ముగ్గురూ నిశ్శబ్దంగా రోడ్డంట నడుస్తున్నారు. వర్షపు నీరు జోరుగా ప్రవహిస్తున్నది. ఓ కుక్క మొరుగుతు దూరంలో. రత్నహాలు దగ్గర రిక్షావాడి గంటమోత. పార్కు మూలనుండి గాంధీచౌక్ వేపు తిరుగుతున్నారు, మూలనున్న వేపచెట్టు క్రింద ఏదో కదలిక.

చలపతిరావు గుండె ఝల్లుమన్నది.

"ఎవరది?"

"బాబయ్యా! అవిటిముండను...."

తూలుకుంటూ ఆ ఆకారం వాళ్ళదగ్గర కొచ్చింది వంగిన నడుం, నెత్తిమీద జుట్టు లేదు. వానకు తడిసి గడగడ వణుకుతున్నది.

ప్రభాకరరావు నిశ్చేష్టుడైనాడు. ఆ మనిషి, కాళ్ళు జారకుండా, బురదలోకి వేళ్ళు గుచ్చుతూ, వాళ్ళదగ్గరికొచ్చింది. ఒక్కసారి ఆ ముగ్గురివంకా, కళ్ళు చికిలించి చూసింది.

సిల్కుచొక్కాలు, రవ్వల ఉంగరాలు, రిష్టువాచీలు, ఖరీదైన పంచలు, ఉలన్‌పాంటు, 'నాగరికత'తో మిసమిసలాడుతున్న వారిముఖాలు, క్షణకాలం, ప్రచండశక్తితో, జాజ్వల్యంగా ఆమె శుష్క నయనాల్లో భాసించాయి.

ఏ శిథిల స్మృతులు, జీర్ణానుభవాలు, విషదానుభూతులు, వికృత సంవేదనలు, ఆమెలో రేగాయో ఆ భగవంతునికే తెలియాలి. ఆమె మాత్రం, ఒక్క గావుకేక పెట్టి, ముఖం చేతుల్లో దాచుకుని, అక్కడే కూలిపోయింది.

—o—